క్లుప్తంగా

ఆంజనేయ స్వామి ఆలయం వద్ద అన్నదానం

గురజాల: స్థానిక మాచర్ల రోడ్డులో పాలకేంద్రం వద్ద ఉన్న అభయ ఆంజనేయ స్వామి 23వ వార్షికోత్సవాల్లో భాగంగా 16 రోజుల పండుగను పురస్కరించుకుని శుక్రవారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువ జాము నుంచి భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం సమయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, కౌన్సిలర్ ఎస్ బొల్లయ్య, చాగంటి శ్రీనివాసరావు, అడపా శ్రీనివాసరావు, శరమాళ్ల హనుమంతరావు, నజీమూన్ తదితరులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బాల్య వివాహాలపై అవగాహన ఉండాలి



రెంటచింతల: బాల్యవివాహాలతో బాలికలకు తీవ్రమైన ముప్పు కలుగుతుందని పల్నాడు జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ కౌన్సిలర్ కె.శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం రెంటచింతల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కిశోరి వికాసం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చదువుకునే వయస్సులోనే చిన్నారులకు వివాహం చేసి వారి తల్లిదండ్రులు వారి జీవితాలతో ఆడుకుంటున్నారన్నారు. బాల్య వివాహం నేరమని చట్ట ప్రకారం బాల్య వివాహం చేసిన, చేసుకున్న, ప్రోత్సహించిన రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ.లక్ష జరిమానా విధించడం జరుగుతుందని చెప్పారు. రుతుక్రమ సమయంలో తీసుకోవాల్సిన సంరక్షణ చర్యలు గురించి వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాల్య వివాహాలను అడ్డుకోవడానికి చట్టంలో అనేక సవరణలు చేసినట్లు వివరించారు. బాలల హక్కుల గురించి, పోక్సో చట్టం గురించి అవగాహన కల్పించారు. పురవీధులలో అవగాహన ర్యాలీ నిర్వహించి, బాలికలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ రెంటచింతల -1 సెక్టర్ సూపర్‌వైజర్ వై. శ్రీదేవి పాల్గొన్నారు.


ఆదర్శ పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు



కె.పాపయ్య, ప్రిన్సిపాల్

జెట్టిపాలెం(రెంటచింతల): జెట్టిపాలెం ఆదర్శ పాఠశాల(ఏపీ మోడల్ స్కూల్)లో 6 వ తరగతి ప్రవేశానికి గతంలో దరఖాస్తు చేయని విద్యార్థులతో పాటు 7, 8, 9 తరగతుల్లో మిగులు సీట్ల భర్తీకి ఈ నెల 20 తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కె.పాపయ్య శుక్రవారం కోరారు. 6వ తరగతికి 56 సీట్లు, 7వ తరగతికి 50 సీట్లు, 8వ తరగతికి 45 సీట్లు, 9 వ తరగతికి 30 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. జూనియర్ ఇంటర్‌లో ఎంపీసీ, ఎంఈసీ, బైపీసీ గ్రూపులలో కూడా మొత్తం 53 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9182958496లో సంప్రదించాలని కోరారు.

వైభవంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం



మాచవరం: మండలంలోని మొర్జంపాడులోని అలివేలు మంగమ్మ పద్మవతి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. స్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజా కార్యక్రమాలు చేపట్టారు. భక్తులు స్వామిని దర్శించుకుని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. నిర్వాహకులు మహా అన్నదానం చేశారు.

బాలల హక్కుల పరిరక్షణకు చర్యలు



రాజుపాలెం: బాలల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని డీసీపీవో శౌరి రాజు తెలిపారు. మండలంలోని కొండమోడు సమీపంలో గల వీరమ్మ కాలనీలో దీనమ్మ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అనాథ పిల్లల, వృద్ధుల ఆశ్రమాన్ని డీసీపీవో శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు బాలికలను, బాలురను సమానత్వంతో పెంచాలని సూచించారు. ఆశ్రమం వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు గరికపాటి శంకరరావు, సమాచార హక్కు పరిరక్షణ కమిటీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కె.కుమార్, కె.బాబూరావు, కాకుమాను శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి శాంతి కల్యాణం



సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



కల్యాణానికి హాజరైన భక్తులు

- భారీ సంఖ్యలో హాజరైన భక్తులు
- భక్తిశ్రద్ధలతో 15వ వార్షికోత్సవం

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలోని పిలుట్ల రోడ్డులో నాగుల గుడిలోని వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి శాంతి కల్యాణం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఆలయం 15వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని వేద పండితులు ప్రత్యేక పూజలు చేశారు. దంపతులు పీఠలపై కూర్చొని స్వామివారి శాంతి కళ్యాణాన్ని జరిపించారు.వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయానికి ప్రత్యేక విద్యుత్ దీపాలతో అలంకరించి భక్తులకు కనుల పండువగా ఏర్పాటు చేశారు. నూతనంగా గోపురాన్ని నిర్మించి, గోపురంపై కలశలను ప్రతిష్టా మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. హాజరైన భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం చేశారు. కళ్యాణ అనంతరం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహానికి ప్రత్యేక పూలతో అలంకరించి భక్తుల దర్శనార్థం ఏర్పాటు చేశారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

డీఆర్‌డీఏ పాజెక్టు డైరెక్టర్ ఝాన్సీరాణి



నకరికల్లులోని జెడ్పీ హైస్కూల్‌లో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పాజెక్టు డైరెక్టర్ ఝాన్సీరాణి

నకరికల్లు: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని డీఆర్‌డీఏ పాజెక్టు డైరెక్టర్ ఝాన్సీరాణి పేర్కొన్నారు. యోగాంధ్ర - 2025 కార్యక్రమాన్ని స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిత్యం యోగసనాలు వేయడం వల్ల మానసిక రుగ్మతల నుంచి విముక్తి లభిస్తుందన్నారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో యోగాసనాలు వేశారు. ప్రముఖ యోగా శిక్షకుడు బ్రహ్మయ్య యోగాసనాలను వివరించారు. కార్యక్రమంలో ఆయుష్ వైద్యాధికారి రాజ్యలక్ష్మి, ఎంపీడీఓ జి.కాశయ్య, డిప్యూటీ ఎంపీడీఓ కె.వి.శివప్రసాద్, మండల పరిషత్, వెలుగు సిబ్బంది, యోగా అభ్యాసకులు పాల్గొన్నారు.

యోగా పోటీలు

బెల్లంకొండ: నిత్యజీవితంలో ప్రతి ఒక్కరూ యోగాను అలవాటు చేసుకోవాలని ఎంపీడీవో శ్రీనివాస్ నాయక్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆయుష్ శాఖ ఆధ్వర్యాన శుక్రవారం మండల స్థాయి యోగా పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య ఆనంద స్వర్ణాంధ్ర సాకారమే యోగాంధ్ర లక్ష్యమని తెలిపారు. 10 నుండి 18 ఏళ్ల పిల్లలకు యోగాలో సూర్య నమస్కారాల పోటీలను నిర్వహించారు. జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి యోగా పోటీలకు విద్యార్థులను సిద్ధం చేస్తున్నట్లు ఎంపీడీవో తెలిపారు. కార్యక్రమంలో మండల ఆయుర్వేద వైద్యుడు ఆర్.శ్రీనివాస్, యోగా టీచర్లు కోటేశ్వరమ్మ, మాస్టర్ ట్రైనర్ నరేష్, ఈవోపీఆర్డీ వెంకటగిరి రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైకుంఠపురం గ్రామపంచాయతీ నిధులు స్వాహా

అమరావతి: మండలంలోని వైకుంఠపురం గ్రామంలో కొండ నుంచి అక్రమంగా గ్రావెల్ తవ్వి గ్రామ పంచాయతీ డంపింగ్ యార్డు వద్ద నింపి అధికార పార్టీ నాయకులు జేబులు నింపుకొన్నారని పల్నాడు జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షుడు ఆలోకం సుధాకరబాబు శుక్రవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. డంపింగ్ యార్డు వద్ద గ్రావెల్ తోలకం అవసరం లేనప్పటికీ పంచాయతీ నిధులు కాజేయాలనే దురుద్దేశంతో పది రోజుల క్రితం గ్రామ సర్పంచ్ మేకల విఠలావు, టీడీపీ నాయకుడు బండ్ల శ్రీనివాసరావు కలిసి వైకుంఠపురం కొండ నుంచి గ్రావెల్‌ను అక్రమంగా తరలించారన్నారు. కొండ తవ్వి గ్రావెల్‌ను డంపింగ్ యార్డు దగ్గర చదును చేసి సుమారు రూ.1.20లక్షలు బిల్లు చేసుకున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో సుమారు రూ. 30 లక్షలకు పైగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులను గ్రామంలో నామమాత్రంగా ఖర్చు చేసి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారన్నారు. వీటిపై జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రాలు ఇస్తానని పేర్కొన్నారు.

ఓఎన్‌జీసీ అధికారుల తీరుపై రైతుల ఆగ్రహం



గొరిజవోలులో ఓ రైతు పొలంలో బోరు వేస్తున్న సిబ్బంది

నాదెండ్ల: భారతీయ కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ ఓఎన్‌జీసీ అధికారులకు శుక్రవారం చుక్కెదురైంది. మండలంలోని గొరిజవోలు గ్రామంలో గత రెండు మూడు రోజులుగా ఓఎన్‌జీసీ సంస్థ అధికారులు పొలాల్లో బోర్లు వేస్తున్నారు. సుమారు 70 అడుగుల లోతు బోరు వేసి పూడ్చకుండా వదిలేస్తున్నారు. దీనిపై గ్రామానికి చెందిన కారసాల శంకర రెడ్డి మరికొంతమంది రైతులు ఓఎన్‌జీసీ అధికారులను నిలదీశారు. తమ పొలాల్లో బోర్లు వేసే హక్కు మీకెక్కడిదంటూ ప్రశ్నించారు. ప్రభుత్వం అనుమతి ఉంటే ఆధారాలు చూపాలని డిమాండ్ చేశారు. దీంతో వారు సమాధానం చెప్పలేక అక్కడి నుండి వెనుదిరగాల్సి వచ్చింది. గత రెండు నెలలుగా చిలకలూరిపేట నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఓఎస్‌జీసీ అధికారులు రైతుల అనుమతులు లేకుండానే బోర్లు వేశారు. ఈ బోర్లు ఎందుకు వేస్తున్నారనే విషయాన్ని రైతులకు చెప్పకపోవటమే కాక, వేసిన బోర్లను పూడ్చకపోవటంపై రైతులు మండిపడుతున్నారు.

9న అరుణాచలంకు ప్రత్యేక బస్సు

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి ఆర్టీసీ డిపో నుంచి అరుణాచలంకు ఈ నెల 9న రాత్రి తొమ్మిది గంటలకి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు బయలుదేరుతుందని డిపో ట్రాఫిక్ ఇన్‌చార్జ్ ఫాతిమా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10న శ్రీకాళహస్తి, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్‌కు చేరుకొని అదే రోజు రాత్రికి అరుణాచలం చేరుకుంటుందన్నారు. అనంతరం తిరిగి 11న కంచికి అక్కడి నుంచి రాత్రికి బస్సు బయలుదేరి 12న ఉదయం సత్తెనపల్లికి చేరుతుందని వివరించారు. టిక్కెట్ ధర రానుపోను ఒక్కొక్కరికి రూ. 2,500. ఇతర వివరాలకు 99592 25429, 73828 97583, 73828 96966, 73828 97116 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపిక



క్రోసూరు: క్రోసూరు మోడల్ స్కూల్‌కు చెందిన నలుగురు విద్యార్థులు 2024-25 విద్యా సంవత్సరంలో నిర్వహించిన ఎన్‌ఎంఎంఎస్ పరీక్షల్లో ఎంపిక అయ్యారని ప్రిన్సిపాల్ మేరీ సుజున్ శుక్రవారం తెలిపారు. విద్యార్థులు ఉమామహేశ్వరీ, కుంభ అనూష, డి.కిరణ్‌కుమార్, డి.చరణ్‌తేజ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారని చెప్పారు. ఎంపికైన విద్యార్థులకు నాలుగు సంవత్సరాలపాటు మెరిట్ ఉపకార వేతనాలు పొందుతారని వివరించారు. విద్యార్థులను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

క్రోసూరు ఎక్సైజ్ స్టేషన్ పరిశీలన



క్రోసూరు. క్రోసూరు ప్రొబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌ను శుక్రవారం పల్నాడు జిల్లా ప్రొబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ కె.మణికంఠ సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా నవోదయకి సంబంధించి నాటు సారా రహిత గ్రామాలను తరచు సందర్శించి అక్కడి ముద్దాయిల పరిస్థితి ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉండాలని సూచించారు. అనంతరం క్రోసూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని నాలుగు మద్యం దుకాణాలను సందర్శించి తనిఖీ చేశారు. కార్యక్రమంలో క్రోసూరు ఎక్సైజ్ సీఐ టి. తులసి, సిబ్బంది పాల్గొన్నారు.

దాతలు సహకారం అభినందనీయం

శావల్యాపురం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి దాతల సహకారం అభినందనీయమని వైద్యాధికారి మాణ్యం రాధాకృష్ణన్ అన్నారు. శుక్రవారం ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి మాట్లాడుతూ శావల్యాపురం గ్రామానికి చెందిన మంచికలపూడి రామకృష్ణ మంచికల పూడి మారుతి (అమ్మ) కుటుంబ సభ్యులు ప్రవాసా భారతీయులు యామిని లక్ష్మీదుర్గా,షాలిని, ధనుష్, రూ.35 వేల విలువ చేసే కుర్చీలు, ఆపరేషన్ థియేటరులో వినియోగించే స్టీలు డస్క్ పరికరం వితరణ చేసినట్లు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యత

మాచవరం: పచ్చదనం పెంపొందించడం సామాజిక బాధ్యతగా గుర్తించాలని డెప్యూటీ రేంజ్ ఆఫీసర్ విజయలక్ష్మి అన్నారు. అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రమైన మాచవరంలో పలు ప్రభుత్వ కార్యాలయాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పచ్చదనంతో ప్రజారోగ్యాన్ని కాపాడుకోవచ్చని వాతావరణ కాలుష్యాన్ని తగ్గించుకోవచ్చు అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు, బీట్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పశువుల దాణా పంపిణీ

అచ్చంపేట: పశుసంవర్ధకశాఖ ద్వారా పాడి రైతులకు 50శాతం సబ్సిడీపై ప్రభుత్వం పశువుల దాణా ఇస్తోందని ఈ అవకాశాన్ని పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి డాక్టర్ స్వాతి దేవి తెలిపారు. మండలంలోని పెదపాలెంలో శుక్రవారం ఆమె పాడి రైతులకు సబ్సిడీపై పశువులదాణా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాలదిగుబడులు పెరిగేందుకు ప్రభుత్వం కల్పించే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ దాణాలో పోషక విలువలు ఎక్కువగా ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ సిబ్బంది, గ్రామ రైతులు నెల్లూరి వెంకటయ్య, బొంతు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బెదిరించిన వ్యక్తిపై కేసు నమోదు

సత్తెనపల్లి: బాకీ అడిగినందుకు బెదిరించి, దూషించిన వ్యక్తిపై సత్తెనపల్లి రూరల్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. వివరాలు ఇలా ఉన్నాయి. సత్తెనపల్లి మండలం అబ్బూరు గ్రామానికి చెందిన బాచిన వెంకటేశ్వరరావు పురుగు మందుల దుకాణంలో గ్రామానికి చెందిన షేక్ నాగుల్‌మీరా రెండేళ్లుగా రూ. 1.30 లక్షలు పురుగు మందులు వాడుకున్నాడు. గత నెల 15న నాగుల్‌మీర దుకాణం వద్దకు రాగా సీజన్ వచ్చింది బాకీ తాలూకు నగదు చెల్లించాలని అడిగాడు. దీంతో ఇవ్వను చేతనైంది చేసుకోమంటూ నాగుల్‌మీరా దురుసుగా మాట్లాడాడని, అంతటితో ఆగకుండా మద్యం సేవించి ఇంటి వద్దకు వచ్చి తనను బెదిరించడంతో పాటు మహిళలను కూడా దూషించాడని వెంకటేశ్వరరావు సత్తెనపల్లి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఏపీ మోడల్‌స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

క్రోసూరు: ఏపీ మోడల్ స్కూల్ 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి 7, 8, 9 తరగతుల్లో ప్రవేశానికి రాష్ట్ర విద్యాశాఖ నోటిఫికేషన్ విడుదల చేసిందని పాఠశాల ప్రిన్సిపాల్ మేరీసుజన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ముందుగా ఏపీఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ లేదా సీఎస్‌సీ.ఏపీ జీవోవీ.ఇన్ లేదా ఏపీ.సీజీజీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ సందర్శించాలన్నారు. ఈనెల 10వ తేదీ లోపు విద్యార్థులు రిజిస్టర్ చేసుకోవాలని తెలిపారు. రిజిస్టర్ చేసుకున్న వారు ఈనెల 20 వరకు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఈనెల 24న ప్రవేశ పరీక్ష నిర్వహించబడుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని తల్లిదండ్రులు, విద్యార్థులు వినియోగించుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

వీధికుక్కల నియంత్రణ ప్రత్యేక డ్రైవ్



కుటుంబ నియంత్రణకు కుక్కలను తరలిస్తున్న సిబ్బంది

వినుకొండ: పట్టణంలో వీధికుక్కలకు కుటుంబనియంత్రణ ఆపరేషన్లు ఐదవవిడత డ్రైవ్ ప్రారంభమైనట్లు మున్సిపల్ కమీషనరు సుభాష్‌చంద్రబోస్ శుక్రవారం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకాశం జిల్లా ఒంగోలు స్నేహ సొసైటీ ఆధ్వర్యంలో 155 కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లతో పాటు యాంటి రేబిస్ ఇంజక్షన్లు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది సాగర్, లక్ష్మయ్య, నాగరాజు, దావీదు, తదితరులుపాల్గొన్నారు.

పది మూల్యాంకనంలో కూటమి ప్రభుత్వం విఫలం

వైఎస్సార్ సీపీ వైద్య విభాగం అధికార ప్రతినిధి డాక్టర్ అశోక్ కుమార్



పిడుగురాళ్ల: పది పరీక్ష పేపర్ల మూల్యాంకనంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైఎస్సార్ సీపీ వైద్యుల విభాగ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ పేర్కొన్నారు. పట్టణంలో తన కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఫలితాల్లో లోపాల వలన విద్యార్థుల భవిష్యత్ అగమ్యగోచరంగా మారిందని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 64 వేల మందికి పైగా విద్యార్థులు పదో తరగతి పరీక్ష ఫలితాల్లో రీవెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. అధికారికంగానే 11 వేల మందికి పైగా విద్యార్థుల మార్కుల్లో తేడాలు వచ్చాయని, చాలామంది విద్యార్థులకు 95శాతం మార్కులు వచ్చిన వారికి కూడా ఒక సబ్జెక్టు ఫెయిల్ అవడం, రీ వెరిఫికేషన్‌లో ఫెయిల్ అయిన సబ్జెక్టు 90 శాతం మార్కులు రావడం అంటే అర్థం ఏమిటో చెప్పాలని కోరారు. విద్యార్థుల ఉన్నత చదువులు చేసే సమయం వృథా అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులు పరీక్షలో రాసిన జవాబులకు మార్కులు వేసే విషయంలో ఇంతటి నిర్లక్ష్యం వహించడం వలన విద్యార్థుల భవిష్యత్‌తో ఈ ప్రభుత్వం ఆడుకుంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి అవకతవకలు జరగకుండా ఉన్నత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు నష్టపోయిన విద్యార్థులకు పూర్తిస్థాయిలో కూటమి ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు.

వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషి



పాముల సంపూర్ణమ్మ

రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతలకు చెందిన పాముల సంపూర్ణమ్మను వైఎస్సార్ సీపీ మాచర్ల నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలుగా నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనపై నమ్మకంతో మాచర్ల నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలుగా నియామకానికి కృషి చేసిన పల్నాడు జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీని నమ్ముకుని గ్రామాలలో వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషి చేసినందుకు తనకు తగిన గుర్తింపు లభించిందన్నారు. పార్టీ ఆదేశాల మేరకు నాయకులు, కార్యకర్తలతో కలిసి గ్రామాలలో పార్టీ బలోపేతానికి తన శక్తిమేరకు కృషి చేస్తానన్నారు. సంపూర్ణమ్మకు పార్టీ మండల అధ్యక్షులు గొట్టం బ్రహ్మారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నవులూరి భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ గాలి ప్రతాప్‌రెడ్డి, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ మద్దిరాల కృష్ణారెడ్డి, మద్దిరాల కృష్ణారెడ్డి, పార్టీ నాయకులు పేర్ల ముత్తయ్య, పల్లెర్ల కోటిరెడ్డి, పులి ఓబుల్‌రెడ్డి, గుండా కిశోర్ తదితరులు అభినందించారు.

ముగిసిన సోమేశ్వర దేవాలయం వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో స్వామి వారి మూల విరాట్



పూజల్లో పాల్గొన్న దంపతులు

శావల్యాపురం: మండలంలోని గంటావారిపాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీ గంగా పార్వతీ సమేత శ్రీసోమేశ్వర స్వామి దేవాలయం 8వ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారంతో ముగిసినట్లు ఆల య పూజారి సౌభాగ్యశర్మ తెలిపారు. ఈనెల 4 నుంచి ప్రారంభం కాగా చివరిరోజు దేవాలయ ప్రాంగణంలో ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరణ చేసి వేదపండితులు వేద మంత్రాల నడుమ దంపతులచే శాంతి కల్యాణం వేడుకలు ఘనంగా నిర్వ హించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను గ్రామోత్సవం నిర్వహించారు. కోలాటం ప్రదర్శన కార్యక్రమం అందరు తిలకించారు. పార్టీలకు అతీతంగా గ్రామస్తులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త ప్రముఖ వ్యాపారవేత్త సత్యసీడ్స్ అధినేత కొసనా రామకోటేశ్వరరావు-ధర్మపత్నీ కృష్ణకుమారి దంపతులచే స్వామి వారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి మూల విరాట్ విగ్రహాన్ని పూల మాలలు వెండితోరణాతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భారీ అన్నసంతర్పణ కార్యక్రమంలో భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. దేవాలయాన్ని విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. ఈకార్యక్రమంలో పోతుల శ్రీనివాసరావు, చెన్నంశెట్టి నాగేశ్వరరావు, మన్నం వెంకటేశ్వర్లు, పోతుల నరసింహారావు, శేషాద్రి, కర్ణా వెంకటేశ్వర్లు, కొనకంచి వెంకటరావు, మలిశెట్టి నరేష్, రావి సుబ్బారావు, గోపాలం సుబ్బారావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పీఎం సూర్యఘర్‌తో సులభంగా సోలార్ విద్యుత్

- వినియోగదారులకు సూచించిన ఎస్ఈ విజయకుమార్
- డీ2సెక్షన్‌లో దాడులు చేసి రూ.3.68 లక్షల అపరాధ రుసుం విధింపు



మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు, విజయకుమార్

నరసరావుపేట: విద్యుత్ వినియోగదారులు అందరూ ప్రధానమంత్రి సూర్యఘర్ పథకాన్ని వినియోగించుకొని సబ్సిడీపై తమ గృహాలు, వాణిజ్య సముదాయాలకు సోలార్ పవర్ ఫలకాలను ఏర్పాటు చేసుకోవాలని విద్యుత్ శాఖ జిల్లా పర్యవేక్షక ఇంజనీరు డాక్టర్ పి.విజయకుమార్ కోరారు. శుక్రవారం కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో సూరఘర్ వల్ల కలిగే ప్రయోజనాలు, లాభాలను గురించి వివరాలను వెల్లడించారు. మూడు కిలోవాట్‌ల ఫలకాలు బిగించుకుంటే రూ.78 వేలు సబ్సిడీ లభిస్తుందని, రెండు కిలోవాట్‌ల ఫలకాలకు రూ.60 వేలు, ఒక కిలోవాట్‌కు రూ.30 వేలు సబ్సిడీ లభిస్తుందన్నారు. వినియోగదారులకు కావాల్సిన బ్యాంకు రుణం, అనుకూలమైన సోలార్ ఫలకాలు వారే నిర్ణయించుకోవచ్చన్నారు. ఒక కిలోవాట్‌కు రోజుకు 4.5 యూనిట్లు చొప్పున నెలకు 135 యూనిట్ల వరకు, మూడు కిలోవాట్‌ల ఫలకాలకు 375 ఉత్పత్తి జరుగుతుందన్నారు. వీటిలో వినియోగదారులు వినియోగించుకోగా మిగిలిన విద్యుత్‌ను నూతనంగా ఏర్పాటుచేసిన స్మార్టు మీటరు ద్వారా గ్రిడ్‌కు అనుసంధానం చేయటం జరుగుతుందన్నారు. ఈ విధంగా గ్రిడ్‌కు వినియోగదారుల నుంచి వచ్చిన విద్యుత్‌కు ఆర్నెల్లుకు ఒకసారి సెటిల్ చేయటం జరుగుతుందని పేర్కొన్నారు.

అపరాధ రుసుం విధింపు

అలాగే శుక్రవారం పట్టణంలో విద్యుత్ విజిలెన్స్, ఆపరేషన్ విభాగాల అధికారులు 3219 సర్వీసులు తనిఖీ చేసి రూ.3.68 లక్షల అపరాధ రుసుం విధించినట్లు ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్లు సీహెచ్ రాంబొట్లు, సీహెచ్.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. 135 మంది అధికారులు, సిబ్బంది 45 బృందాలుగా ఏర్పడి ఈ తనిఖీల్లో పాల్గొన్నారన్నారు. అనుమతించిన లోడుకంటే అధికంగా విద్యుత్ ఉపయోగించుకున్న 68 మందికి రూ.3,60,800లు అనుమతించిన కేటగిరీల కంటే ఇతర కేటగిరీల విద్యుత్ వాడుకున్న ముగ్గురికి రూ.8 వేలు అపరాధ రుసుం విధించటం జరిగిందన్నారు. దాడుల్లో డీపీఈ విభాగానికి చెందిన ఏడీఎం ఎస్వీ ప్రసాద్, టౌన్ ఆపరేషన్ డీఈఈ జీఎస్వీ ప్రసాద్, డీ2 ఏఈ నాగసురేంద్ర పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

నరసరావుపేట టౌన్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ ఎం.వి. చరణ్ శుక్రవారం తెలిపారు. ప్రకాష్ నగర్‌కు చెందిన సూరేపల్లి కృష్ణ సెయింటాన్స్ స్కూల్ సమీపంలో నడిచి వెళ్తుండగా ఆటో ఢీకొంది. సంఘటనలో కృష్ణాకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని స్థానికులు సమీపంలోని ప్రైవేటు వైద్యశాల్లో చేర్పించారు. ఈ మేరకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.